
# దగుల్బాజి

"వైదేహి"




సుబ్రహ్మణ్యం, వసంత, ఇద్దరూ ఒక సెక్షన్‌లో టైపిస్టులుగా పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆకర్షితులైనారు. చివరకు పెద్దలతో సంప్రదించి, పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికొచ్చారు.

పెళ్లికొడుకుల డిమాండ్ పెరిగిన ఈ రోజుల్లో సుబ్రహ్మణ్యం కొరకు రోజు కొకరైనా, ఇంటికో, ఆఫీసుకో వచ్చి, విచారించి పోతూండే వాళ్ళు. వాళ్ళందరికీ ఏవో అబద్ధాలు, కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటూ వస్తున్నాడు సుబ్రహ్మణ్యం. ఎంత త్వరగా వసంతా వాళ్ళ పెద్దలతో మాట్లాడి, ముహూర్తాలు పెట్టించేస్తే, అంత మంచిదను కున్నాడు. ఈ విషయం ఇప్పటికే చాలామందికి తెలిసిపోయింది. ఇంకా జాప్యం చేస్తే, వాళ్ళందరి వద్ద తమ ప్రేమ అపహాస్యంపాలయ్యే ప్రమాద ముంది. ఆఫీసుకొస్తూ ఆలోచిస్తున్నాడు సుబ్రహ్మణ్యం.

ఆఫీసుకొచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేశాడు. తన పేరు కిందనే వున్న, వసంత పేరు కెదురుగా ''సి. ఎల్.'' మార్కు చేసివుంది. ''అయితే ఈ రోజు వసంత ఆఫీసుకు రాదన్న మాట. ఏమైందో ఏమో ? కొంపతీసి పెద్దవాళ్ళు ఏ పెళ్ళిచూపులో ఏర్పాటుచేసి, ఆమెను ఇంటివద్ద కట్టిపడెయ్యలేదుకదా? ' ఈ ఆలోచన వచ్చినప్పుడు సుబ్రహ్మణ్యంలో అనిర్వచనీయమైన బాధ కలిగింది. తన సెక్షన్‌లోకి వెళ్ళి టైప్‌రైటర్‌పై వున్న ముసుగు తీసాడు. తను టైప్ చేయవలసిన కాగితాలు అప్పటికే టేబుల్‌పై సిద్ధంగా వున్నాయి. ఈ రోజు వసంత రాదుగనుక, ఆమె పనికూడా తనే చేయవలసివస్తుంది. ఆమె వాటా పని చేయవలసివచ్చేందుకు కాదుగానీ, ఆమె రాక పోతే, తనకు ఆఫీసులో పని చెయ్యబుద్ధెయ్యదు.

చేసేదేమీలేక, అతికష్టంమీద రెండు కాగితాలు టైప్ చేశాడు. ఒకసారి అలా వెళ్ళి టీ త్రాగి, ఒక సిగరెట్ వెలిగిస్తే మనసుకు కాస్త రిలీఫ్ వస్తుందనుకొని, పైకి లేచి, ఆఫీసు కెదురుగా వున్న టీ స్టాల్‌వైపు నడిచాడు.

''ఏమోయ్ ! సుబ్రహ్మణ్యం ! ఈ రోజు చాలా డల్‌గా వున్నావు. నీ ప్రేమికురాలు రానందుకేనా ?'' టీ స్టాల్‌నుండి బయటికొస్తూ ఎదురైన గురుప్రసాదం అడిగాడు.

''వీడొకడు. మమ్మల్ని గమనిస్తూండడమే వీడి పని. గుడ్లగూబ'' అని విసుక్కున్నాడు లోలోపల.

పైకి మాత్రం నవ్వుతూ, ''అదేం కాదు గురూ ? వంట్లో అంత కులాసాగా లేదు'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''నాకు తెల్సులేవోయ్'' అంటూ అతను ముందుకు సాగిపోయాడు.

''ప్రేమ వ్యవహారాలు యెంత గోప్యంగా వుంచితే, అంత మంచిది. కానీ అవి అలా దాగవే'' అనుకుంటూ స్టాల్ లోనికి వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. సర్వర్‌కు టీ తెమ్మని ఆర్డర్ ఇచ్చి, టీ తాగి డబ్బు చెల్లించి బయటికొస్తూంటే, ఒక నడివయస్కుడు అతనివద్ద కొచ్చాడు.

''సార్ ! మీరీ ఆఫీసులో పని చేస్తున్నారా?'' యెదురుగా కనిపిస్తున్న సుబ్రహ్మణ్యం వాళ్ల ఆఫీసును చూపిస్తూ నమ్రతగా అడిగాడాయన.

అవునన్నట్లు తలూపాడు, అనుమానంగా ఆ వ్యక్తిని చూస్తూ సుబ్రహ్మణ్యం.

''ఇక్కడ సుబ్రహ్మణ్యం అనే ఒక కుర్రాడు పని చేస్తున్నాడట. ఆ అబ్బాయి గుణగణా లెలాంటివో చెప్పగలరా ?'' అత నడిగాడు.

ఇద్దరూ ఆఫీసు ప్రహరీగోడ కింద కొచ్చి నిల్చున్నారు.

''ఏం ఏదైనా పెళ్లి సంబంధమా ?'' అడిగాడు సుబ్రహ్మణ్యం.

''అవునండీ !''

''అయితే వినండి. అతనికి దాదాపు ముప్పై ఏళ్ళుంటాయి. అతన్ని చేసుకోడానికి యెవరూ ముందుకు రాలేదు. అనాకారి. అంతేకాదు. పైలాపచ్చీసుగా తిరుగుతూంటాడు. జూదం ఆడుతాడు. వ్యభిచార గృహాల కెడతాడు. అమ్మా నాన్నలకు కూడు పెట్టడానికి ఏడుస్తాడు. అతనికి లేని దురలవాటు లేదు. అలాంటి నీచుణ్ణి చేసుకొని ఏ ఆడపిల్ల సుఖపడుతుందో నా కర్థం కాదు'' అన్నాడు సుబ్రహ్మణ్యం శూన్యంలోకి చూస్తూ

''అంత చెడ్డవాడా ?'' నమ్మలేనట్లు అడిగాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

''అయినా నాకెందుకుగానీ ... నేనిలా చెప్పానని వాడితో అనకండి'' అని ముందుకెళ్లి పోబోయాడు సుబ్రహ్మణ్యం.

''చూస్తూ...చూస్తూ ... మా పిల్ల గొంతు కొయ్యలేను. నాకీ నిజం తెలియచేసినందుకు చాలా కృతజ్ఞతలు. అయినా ఆ దగుల్బాజీని ఒకసారి చూపిస్తారూ ?'' అన్నాడు అతను.

సుబ్రహ్మణ్యం ముందు తత్తరపడి, తర్వాత తేరుకొని ఏదో చెప్పబోయేంతలో అదే సమయంలో మత్తుగా తూలుతూ రోడ్డుపైన వెడుతున్న ఒక యువకుణ్ణి చూపించి, ''అదిగో ... మాటలలోనే వచ్చాడు ! వాడే ఆ దగుల్బాజీ !'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

అతనికేసి చూచాడు పెళ్లిపెద్ద. నీరుకావి పట్టిన గుడ్డలు వేసుకొని, చింపిరిజుట్టుతో, తూలుతూ నడిచిపోతున్నాడు, ఆ యువకుడు.

''అమ్మబాబోయ్! వస్తాను '' అని గోడవారగా నిలిపివున్న సైకిల్ ఎక్కి వేగంగా వెళ్ళిపోయాడు ఆ పెళ్ళి పెద్ద.

# 1978 లో

ఈ క్రిందివారి

రచనలు

# భారతి

ప్రచురించింది.

★

[మీరు

గమనించారా ?]

★

* కేవస్వి * పిరాట్ల * పరబ్రహ్మ శాస్త్రి * దిలావర్ * సౌంధ్యశ్రీ * ఇస్మాయిల్ * సదానంద * సౌంకలియా * శివారెడ్డి * శేషేంద్రశర్మ * సోమసుందర్ * లక్ష్మీరంజనం * నారాయణ రెడ్డి * సిథారెడ్డి * రమణారెడ్డి * దాశరథి * మధునాపంతుల * శివప్రసాద్ * నిఖిలేశ్వర్ * తిలక్ * కార్తికేయ శర్మ * కాళిదాసు * మురళీధర్ * జ్వాలాముఖి * కొలకలూరి * రామాచంద్రమౌళి * సంపత్కుమారాచార్య.

★

[వీరు కాక ఇంకా
ఎందరో వున్నారు !
ఈ జాబితా
మచ్చుకి మాత్రమే !]

## దగుల్బాజీ

"మళ్ళీ రాకు — నా ప్రాణం తీయకు" అని, తను ఆడిన నాటకానికి తనను తానే అభినందించుకుంటూ, ఆఫీసులోకి వెళ్ళిపోయాడు, సుబ్రహ్మణ్యం.

* * *

మరు రోజు వసంత ఆఫీసు కొచ్చింది. అటెండెన్స్ రిజిష్టర్లో సంతకం చేసి, వెళ్ళి తన స్థానంలో కూర్చుని టైప్‌రైటర్ టకటక లాడించసాగింది.

వస్తూనే "హల్లో !" అని పలకరించే వసంత ఈ రోజు అంత సీరియస్‌గా వుండడం ఎందుకో సుబ్రహ్మణ్యానికి అర్థం కాలేదు.

"వసంతా !" పక్కనే కూర్చున్న సుబ్రహ్మణ్యం పలకరించాడు.

"ఏం ?" అంది టైప్ చేస్తూనే.

"ఏం అదోలా వున్నావు ?"

"ఏంలేదు — మనసేం బాగాలేదు."

"ఎందుకని ?"

"తర్వాత చెప్తాను. ఇక్కడ గుడ్లగూబలు చాలా వున్నాయి. మన ప్రేమకు అవరోధం కల్పిస్తాయి." గురుప్రసాదాన్ని దృష్టిలో వుంచుకొని, అంది వసంత.

"ఆ గురుప్రసాదంగాడు ఏదైనా చేశాడా ?"

"చేశాడా ?... చేశాడా ? రాస్కెల్. ఈర్ష్య ఎంతపని చేయిస్తుందని" అంది వసంత.

"ఏం జరిగింది వసంతా ?" అని అడిగాడు సుబ్రహ్మణ్యం అసహనంగా.

ఆమె జవాబు చెప్పడానికి సందేహించింది.

లంచ్ టైమ్‌లో మాట్లాడుకోవచ్చుని సరిపెట్టుకొన్నాడు, సుబ్రహ్మణ్యం. కొంతసేపైన తర్వాత అలవాటుప్రకారం టీ తాగాలని రోడ్డుమీద కొచ్చాడు

అంతే. అతని కాలర్ పట్టుకొని ఎవరో వెనక్కు లాగారు. సుబ్రహ్మణ్యం తూలి అతని ఛాతీమీద పడ్డాడు. ఎవరా అని అతనికేసి చూచాడు. నిన్న తనను గురించి వాకబు చేసిన పెళ్ళిపెద్ద.

"ఏమైంది ?"

"సుబ్రహ్మణ్యం గురించి అబద్ధాలు చెప్పిన పెద్దమనిషివి నీవేకదూ ?" గుడ్లెర్రచేసి అడిగాడు, అతను.

"అబద్ధాలేముంది ? అన్నీ నిజాలే" అన్నాడు సుబ్రహ్మణ్యం బెదురుకుగా.

"ఏముకలేరేస్తాను ... నిజం చెప్పు." బెదిరించాడు అతను కాలరు బిగించిపడ్తూ.

"నేను అబద్ధం చెప్పానని, మీకెవరు చెప్పారు ?" వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నేను తర్వాత మా ఫ్రెండ్‌ను అడిగాను. అతనికి సుబ్రహ్మణ్యం గురించి బాగా తెలుసు"

"అయితే ఇప్పుడు నన్నేం చేయమంటావ్ ?"

"అబద్ధాలు చెప్పినందుకు, ఒక మంచి వ్యక్తిని నీచుడుగా చిత్రించినందుకు నాచేత తన్నులు తినమంటాను" అంటూ చేయి పైకెత్తాడతను

"ఒరే ! అన్నయ్యా ! ఆయన్ను వదులు ... ఎందుకలా హింసిస్తున్నావు ?" అంటూ పరుగెత్తుకొచ్చింది వసంత.

"వీడేనమ్మా ! నీ సుబ్రహ్మణ్యం గురించి అవాకులు చవాకులు అల్లి చెప్పిన రాస్కెల్" అన్నాడు అతను.

సుబ్రహ్మణ్యం, వసంతా ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు ఆశ్చర్యంగా. తర్వాత ఏదో అర్థమైనట్లు ఇద్దరూ పెద్దగా నవ్వుకున్నారు.

వాళ్ళిద్దరూ ఎందుకలా నవ్వుతున్నారో అర్థంగాక తెల్లముఖంవేశాడతను.

"వీరే అన్నయ్యా ! సదరు సుబ్రహ్మణ్యం" అంది వసంత నవ్వాపుకుంటూ.

"అయితే నిన్న మిమ్మల్ని గురించి మీరే ఎందుకలా అబద్ధాలు చెప్పారు ?" కాలర్ వదిలేస్తూ అడిగాడు వసంత అన్నయ్య.

"మీరెవరో నాకు తెలియదాయె ... నాకేమో రోజుకొకరు పెళ్ళి బేరాలు తెస్తున్నారు. వసంతకోసం వాళ్ళందర్నీ తప్పించుకోడానికి, రోజుకొక అబద్ధం చెప్పలేక నా పని అవస్తాయి పోతూంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"భలేవాడివయ్యా ! బావమరిదీ ! నీకిక ఆ అవస్థ కల్పించనులే" అన్నాడు అతని చెయ్యి, తన చేతిలోకి తీసుకుంటూ వసంత అన్నయ్య.

**నాతో నేస్తం కడతావా ?....**

—ఫొటో : ఎన్. సత్యనారాయణ

